


గోపాలానికి చాలా రోజులకిగాని వుద్యోగంరాలేదు–చాలారోజులంటే ఆరోజుల్ని కొలిచిచూస్తే బి.ఏ. పాసైన తరువాత మూడు సంవత్సరాలని తేల్తుంది. ఈ మూడేళ్ళూ అతనుపడ్డ స్ట్రగుల్ నిరుద్యోగులకు చెబితే సగం మంది నిరుద్యోగులు ఆత్మహత్యా ప్రయత్నాలు – మరికొంతమంది జీవితాన్ని రోసి యే బదరీ రామేశ్వరమో పోయి తపోనిమగ్నులై పోతారు – అంటే సమస్య లన్నీ విరక్తితో పరిష్కారానికి తెచ్చుకుంటారు – నిజానికి రోజూ వాడి నిరుద్యోగ భీతావహ నిస్పృహ మాకే భయం అన్పించేది

అందుకే కావల్సినవాళ్ళు నలుగురు, ముగ్గురం నానారకాల సిక్‌లీవును అప్లై చేసి వంతులవారీ వాడ్ని కాపాడుతూండే వాళ్ళం. వాడి నిరుద్యోగంపట్ల యెంత

భయం ప్రబలిందంటే — వుద్యోగం చేస్తున్న వాళ్ళు కన్పడితే వాళ్ళ మొహంలోకి సూటిగా చూడలేకపోయే వాడు. పదిమంది జనంమధ్య నుంచుంటే శరీరం లోపలనుంచి నువ్వు నిరుద్యోగివని సంగీత గీతా లాలపించేది — యెక్కడా క్షణం నిలబడలేకపోవడం—యెవరితోనూ క్షణంకూడా మాట్లాడలేకపోవడం — మాటలాడాలని ప్రయత్నించినా అవి సణుగుడుగా వెలికి రావడం — యిలాంటి లక్షణాలు దశలవారీగా కన్పించేవి.

పైగా వాడిధోరణి యెలావుండేదంటే "నాకు వుద్యోగం యేజ్ బార్ అవకుండా దొరుకుతుందంటావా; వొకవేళ వుద్యోగం వచ్చినా — ఆరోజున చెయ్యగల్గే నేర్పు వుందంటవా?" యింకా, "వొరేయి, మా తమ్ముడికి ఇంజనీరింగ్ ప్యాసైన మూలంగా వాడికి తొందరగా వుద్యోగం వస్తే — నే నేం చేసేదిరా? నాది ఆల్టో సెషన్ అయిపోయింది...ఛీ" అంటుండే వాడు.

ఆఖరికి వాడి నిస్పృహ యెంతగా వెర్రిపువ్వులు పూసిందంటే యెవరైనా యేదైనా అంటే "వుద్యోగం లేని మూలంగా యెన్ని మాట లంటున్నారు?" అనేశేవాడు. దాంతో చుట్టుపక్కలవాళ్ళు వాడు తప్పు చేసినా మరీ మధనపడి పోతున్నాడని వూరుకునేవారు. లోపల...

"వీడికి ఆఖరికి వుద్యోగం దొరక్క-పోవడం అటుంచి — పిచ్చి యెక్కదు కదా" అనుకుందేటంతగా తయారయ్యాడు.

ఎట్లాగైతేనేం నాల్గవ సంవత్సరం మొదటిపాదంలో గోపాలానికి వుద్యోగం దొరికింది — కాదు — ఆర్డర్స్ వచ్చాయి. ఆరోజే అనుకుంటాను — యూరీ గగారిన్ గగనయాత్ర చేశాడు. ఆరోజే వాడు పెళ్ళి చేసుకుందామని కలలుగన్న పక్కింటి లక్ష్మి మెళ్ళో నాలుగేళ్ళ సర్వీసు వున్న యూ. డీ. సీ. వుస్తెకట్టాడు. వాడు పెంచి పెంచి పెద్దచేసిన గులాబీచెట్టు మొదటిసారిగా పువ్వు పూసింది. వాడు చూసి సంబరపడిపోయే నిండుపున్నమి ఆవేళ ! కానీ యివేమీ మనస్సుమీద ముద్రలు వేయలేకపోయాయి. అయినా ఆరోజు వాడి వుత్సాహానికి నిదర్శనం యేదైనా వుందంటే — అది విప్పిచెప్ప గల్గేది వాడి డైరీ వక్కటే, అరటావు తెల్లకాగితం అంటించి యేవేవో వ్రాసుకున్నాడు — రోజంతా.

రోడ్డుమీద కన్పించిన వ్యక్తికల్లా వుద్యోగం వచ్చిందని చెప్పాడు. ఇంటికి వచ్చి కూర్చుంటే చెప్పని యే వెంకయ్యో గుర్తుకు వచ్చి, పోనీ సైకి ల్దెకుచ్చుకుని వెళ్ళేదా అనుకునేవాడు.

గోపాలానికి వుద్యోగం వచ్చిందని వాళ్ళమ్మగారు జీడిపప్పు వేసి పులిహోర చేశారు — సేమ్యాపరమాన్నం కాచారు. అవి వాడికి సహించలేదు — ఆపూట — అసలు ముట్టుకోనేలేదు. కొడుకు భోజనం

చేస్తుంటే ఆవిడకు ఆశ్చర్యంవేసి లోపలే అనుకున్నారు.

"వీడేమిటి చెప్మా!— ఆనందం వచ్చినా పట్టలేం, విచారం వచ్చినా తట్టుకోలేడు."

వాడి వుద్యోగ నిర్వహణ రెండో మజిలీ అని అనుకుంటే అక్కడినుంచి వాడి జీవితం ఎలా నడిచిందో తెలుసుకోవాలి.

ఆపట్టున రెండురాత్రుళ్ళు వెళ్ళి తన కోక్లర్క్సనీ మానేజర్నీ చూసి ఆపేక్షగా మాట్లాడివచ్చాడు. వచ్చేస్తూంటే అనుకున్నాడు, మానేజర్ యింటికి బత్తాయి పళ్ళైనా తీసుకుని వెళ్ళివుంటే బాగుండేదే అని.

యిక వాడి ప్రశ్నలు...

'యేమండీ మన ఆఫీస్‌లో నా సీటు యేమిటి?" ఫలానా అని జవాబు.

"పని కష్టంగా వుంటుందా. నాకు త్వరగా వస్తుందంటారా" 'ఆ', వో గుమస్తా కంఠం ఫైళ్ళ తెరలోంచి చిన్నగా అంది.

"ఆఫీసరుగార్కి కొంచెం కోపం అనుకుంటాను..." జవాబు "మెల్లిగా అంటారేమిటి? అబ్బో ఆయన అహంకారం, కోపం కవచ కుండలాలుగా ధరించి పుట్టాడు. మన గుమాస్తాగాళ్ళంటే కాళ్ళ తుడుచుకునే పీచుకన్నా లోకువ—దాన్నైనా రోజూ తొక్కడు కానీ."

"యేం—యెందుచేత, యింట్లో సుఖం లేదా?" "గట్టిగా అనకయ్యా బాబూ, యీ ఆఫీసులో ఫైళ్ళకు పరకాయ విద్య తెలుసు. నువ్వాటు వెళ్ళగా చూసి మనుష్యులై వెళ్ళి ఆయనతో నువ్వన్న వన్నీ చెప్పేస్తాయి."

"మంచిగా పనిచేసినా అదే ధోరణా?"

"మంచేవిటయ్యా — నా కర్థంకాక అడుగుతాను. తక్కువ జీతగాళ్ళంటే — అంతే— పైగా— ఆయన తిడ్తూ ఫైళ్ళు మొహాన కొట్టొచ్చు — కనుక ఆయన్ని ఆఫీస రన్నారు. తిడితే పంచదార గుళికల్లా మింగుతాం కనుక ఫైళ్లు యేరుకొని తిరిగి నంబరువారీగా పెట్టుకుంటాం! కనుక మనల్ని గుమాస్తాగాళ్ళన్నారు."

గోపాలానికి అనుమానం వేసింది—

"ఎంతైనా కాన్ఫిడెంషియల్స్ పాడు చేస్తారంటారా — అంత ఘోరమా? బ్రతుకేమైపోవాలండీ"

యీ ప్రశ్నలు, దానికి సంబంధించిన జవాబులు అన్నీకూడా గోపాలం తన అనుయాయుల దగ్గర సంపాదించినవి — ముఖ్యంగా అతనింకా తన ఆఫీసుకు వెళ్ళి జాయినింగ్ రిపోర్టివ్వకుండా సేకరించిన ఆఫీసరోపాఖ్యానం —

యివన్నీ మనం చేసుకుని తను ఆఫీసరు సమ్ముఖంలో — పని ఎట్లా యెలా ప్రవర్తించాలో ఆలోచించుకోనివ్వకుండా మెదడు యెంత సేపూ ఆఫీసులో తను కొత్తచేత పని చెయ్యలేకపోతున్నట్టు ఫైళ్ళు కళ్ళు యెఱ్ఱజేస్తోన్నట్టు — కాలింగ్ బెల్ ధ్వని ద్వారా వచ్చిన ప్యూన్ తనని

యెత్తుకునిపోయి ఆఫీస రనే మాంత్రికుడి ఇంద్రజాలపు గదిలో తోసినట్టు కలలు సృష్టించి చూపేవి.

*    *    *

ఇన్ని భయంకరమైన కలలు కన్నా - కావలసినవాళ్లు ధైర్యాన్ని యింజక్ట్ చేసినా-వుద్యోగంలో చేరవలసిన రోజు. గోపాలం వుద్యోగంలో చేరిన రోజు అయింది.

బి. ఏ. ప్యాస్ అయిన గోపాలం వుద్యోగం సరిగా నిర్వహించ గల్గడంలో ఆశ్చర్యం యేమీలేదు. యేదైనా వుందీ అంటే అతను నిర్వహించలేనేమో ననే భయంలో నే వుంది - ఆలోచించాల్సిన వాళ్ళకు మేత కూడా దొరుకుతుంది. వాడి భయంలోంచి-

నిజానికి కొందరకు తమలో దాగి వున్న శక్తి పూర్తిరూపం తెలియదు. తనని తను చిన్నగా వూహించుకుని బ్రతకడం అలవాటై పోతుంది. కావలసిన వాళ్ళూ, ఆత్మీయులూ హమేషా దగ్గరుండి ధైర్యం యివ్వడం ద్వారా అటువంటి మనుష్యుల్ని - వాళ్ళలో నిద్రాణమైవున్న శక్తిని యెత్తి చూపాలి - అలా చూసినప్పుడే వాళ్ళు రాణిస్తారు. కాని పరిస్థితులు వాళ్ళ నెంతత్వరగా మారుస్తూంటాయో- చుట్టూ మనుష్యులు - అంత త్వరితంగానూ ధైర్యం, కలేజా యివ్వగల్గాలి- అప్పుడు గోపాలం లాంటివాళ్ళు కొంత కాలానికైనా తమ నిజస్వరూపం తెల్సుకుంటారు. గోపాలం వుద్యోగంలో చేరిన రెండునెలలు కళ్ళల్లో జ్యోతులు వెలిగించుకుని-పనిచేసుకుంటూ వచ్చాడు.

మూడోరోజు వెళ్ళవల్సిన కాగితం ముందురోజే చేరేటట్టు తయారు చేసేవాడు-పెర్సనల్ రిజిష్టర్ అట్టలు మాయకుండా, సిరామరకలు తినకుండా ప్రియంగా చూసుకున్నాడు-కోక్లార్క్ 'లేజీ' గా వుంటేనూ, 'కేర్లెస్' గా పని చేస్తూంటేనూ - నలభైయేళ్ళ ముసిలి టైపిస్ట్ శాస్త్రిగారు మిషనుముందు కునికిపాట్లు పడ్తూంటేనూ ఆశ్చర్యపోయేవాడు- మేనేజరన్నవాడు వో మూల కుర్చున్నా, ధైర్యంగా సిగరెట్ కాల్చేస్తూ స్టాఫ్, ఆయన ఆ స్టాఫ్‌తో కబుర్లూ - తన యింక్రిమెంట్లు-భార్య అస్వస్థత-కొనబోయే గేదె యిచ్చే పల్చటి పాల గురించి మాట్లాడ్తూంటే యీయన యీ మేనేజర్‌గిరీకి ఎలా రాగలిగ్గాడా అన్పించేది-విస్మయం కల్గేది.

*    *    *

ఆఫీసర్ గోపాలం కొంచెం పని పట్ల శ్రద్ధ కనపరుస్తా డని-అనుకునేసరికి-ఆఫీసరుగారు తన మొహాన్ని ఫైళ్ళు విసిరేటంత బెబ్బులి కాదేమో అని గోపాలం అనుమానపడే రోజులకి, కొత్త ఆఫీసరు వినాయకరావుగారు - ఆ ఆఫీస్‌కు బదిలీ అయి వచ్చాడు. వెళ్ళిపోతున్న ఆఫీసర్ని కేంటీన్‌లో తోటివాళ్ళు యే పెద్దవాళ్ళ రెకమండేషన్ ద్వారానైనా యీయన ట్రాన్స్‌ఫర్ అగిపోయి, కొత్త ఆఫీసర్



రాకుండావుంటే బాగుండు నని ఆయన్ని తిట్టుకుంటూంటే గోపాలానికి కాఫీ దిగ లేదు – పాత ఆఫీసరు వీడ్కోలు సమయంలో – ఆయన పక్కనే కూర్చున్న వినాయకరావుగారు తననే చూస్తున్నట్లు – పరకాయించి శల్య పరీక్ష చేస్తోన్నట్లు బాధ పడ్డాడు.

గోపాలానికి యింటినుండి రమ్మనమని వుత్తరం వస్తే "నేను చాలా పనిలో వున్నాను – యినస్పెక్షన్ రోజులు – పైగా కొత్త ఆఫీసరు – త్వరలో వస్తానని ప్రస్తుతం రావడం కుదరదనీ వ్రాసేశాడు'.

చార్జీ తీసుకున్న మొదటి రోజు కొత్త ఆఫీసరు మొదటిసారి తెరచింది గోపాలం పుటప్ చేసిన ఫైలు – అందులో డ్రాఫ్టు చదివాడు – కళ్ళు వింతగా మెరిశాయి – క్రోధంగా చదివేయి. స్టాఫ్ అటెండెన్స్ రిజిష్టరు చూశాడు – బెల్ నొక్కి – "గోపాల్రావ్ సెక్షన్‌లో ఫైళ్ళన్నీ తీసుకురా" అన్నాడు ప్యూన్‌తో.

తన దగ్గరకే వస్తున్న ప్యూన్‌ని చూసి గోపాలం ఆశ్చర్య పోయాడు. వాడు అడిగిందే తడవుగా ఫైళ్ళని యిచ్చేశాడు కంగారుగా. లంచ్ యింటర్వెల్‌లో

అతనికి టిఫిన్ సహించలేదు. కాఫీ విషంలా అన్పించింది. దానికి తోడుగా ప్యూన్ సత్యం వచ్చి "మిమ్మల్ని ఆఫీసరు గారు వెళ్ళిపోవద్దన్నారు - పిలుస్తారట - మీ ఫైళ్ళే చూస్తున్నారు," అని

అవతల గదిలో వున్న వినాయకరావు కాఫీ తాగి సిగరెట్ కాలుస్తూంటే ఆలోచనలు చాలాదూరం వెళ్ళాయి. సత్యంతో గోపాలాన్ని పిలవమన్నాడు

వచ్చాడు గోపాలం; భారతదేశ గుమాస్తాలకు స్పెసిమెన్‌లా గదిలోకి నడుస్తూ

యెంతసేపటికీ పేపర్‌లోంచి తనని గుర్తించని వినాయకరావుగార్ని కదిలించాలో తనే కదలాలో తెలీలేదు. దగ్గు ధ్వని ద్వారా తన రాకని తెలియజెయ్యాలన్పించినా సమయానికి దగ్గు రాలేదు-

"సార్, పిలిచారట !"

"నీ పేరేనా గోపాలంరావు."

"అవును సార్," జవాబు

"యెంతకాలం అయింది నువ్వీ ఆఫీసులో జాయినై?".. జవాబు చెప్పాడు- బుర్రంతా సర్వీసు రిజిష్టరు చేస్కొని.

"ఇంకా వర్కు యింప్రూవ్ చెయ్యాలి, డ్రాఫ్టింగ్‌లో ఫ్లూయన్సీ రాలేదు క్విక్‌వర్కు కావాలి"

'సరేనండీ !' అని వెళ్ళమంటే బావుణ్ణనుకున్నాడు. యేకాలేజీలో చదివావు ?"

"పి. ఆర్. కాలేజి, కాకినాడ."

"వుహూ, స్కూల్."

"మెక్లారిన్ హైస్కూలండి !"

"సరే, వెళ్ళు"-

సాయంత్రం ఆరుగంటలకు యింటికి వెళ్ళిపోతున్న గోపాలాన్ని ఆపి ప్యూన్ చెప్పాడు.

"అయ్యగారు మిమ్మల్ని రాత్రి ఇంటికి రమ్మనమన్నా" రని గోపాలానికి అప్పటికే భయంగా వుంది. నిజానికి చదువరులకి హమేషా గోపాలం భయాన్ని తేలిగ్గా తీస్కొని నవ్వేవాళ్ళకి - యీసారి భయం వో కథని చెప్తుంది - నవ్వేవాళ్ళ నోరు కట్టేస్తుంది పైగా భయానికి వుత్పత్త్యర్థం వుంటుందని తర్కించుకుని నమ్మినట్టయితే అవే కథలవుతాయి - మరొకసారి- దాగిన ని(యి)జా లవుతాయి

చిన్నప్పుడు ఫస్ట్‌ఫారం చదివే రోజులలో వో అబ్బాయి తనతమ్ముడు జేబులోంచి అణాకాసు దొంగిలించినందుకు తోటి స్నేహితుణ్ణి - పక్కింటి లాయరుగారబ్బాయిని కొట్టడం జరిగింది-నిజానికి లాయరుగారబ్బాయి మొదట్లోనే అణా తీసుకున్నట్టు వప్పుకునివుంటే ఆ అబ్బాయిని కొట్టేవాడు కాదు. అబద్ధం చెప్పినందుకు - గతరోజు గ్రౌండ్‌లో తనని బ్రేక్ వేసి పడగొట్టి - తను కాదని బొంకినందుకు గుర్తుపెట్టుకుని కొట్టాలనే కొట్టాడు అంతే. అప్పట్నించీ ఆకుర్రాళ్ళిద్దరూ మాట్లాడుకోలేదు. స్కూలు వదలిపెట్టి కాలేజీలో చేరే వయస్సు వచ్చినా వాళ్ళిద్దరిమధ్యా మాటలు కలియలేదు.

తోటికుర్రాళ్ళు - యెంత ప్రయత్నించిచా వాళ్ళిద్దరూ కలియకుండానే, మాట్లాడుకో కుండానే స్కూలు వదిలి పెట్టాల్సి వచ్చింది.

కొట్టిన అబ్బాయి గోపాలం అవడం - దెబ్బలుతిన్న స్నేహితుడు వినాయకరావు ఆఫీసరుగా మారడం జరగడంబట్టి - గోపాలం వూహ కాశీమజిలీ కథలా పెరిగి పోతోంది ఆ సాయంకాలం.

ఆయనతో మాట్లాడుతూంటే ఆ స్వరం గుర్తొచ్చింది. చూసీ చూడనట్టు చూశాడు. నుదురు మీద చిన్న సైజు దెబ్బ, అలాగేవుంది. బయటకు వచ్చి "నన్ను గుర్తు పట్టాడా ఆయన" అను కునేసరికి అతనికి చెమటలు పట్టాయి. చుట్టూ వ్యక్తులు అంతా వింతగా తలక్రిం దులుగా నడుస్తూన ట్లనిపించింది...

* * *

గోపాలం వూహప్రకారమే ఆఫీసరు- అతన్ని గుర్తుపట్టడం జరిగింది. ఆఫీసరు హోదాలో పలకరించలేక పోయిన కారణం ఆయన యింటికి వెళ్ళిన తరు వాత ఆలోచనల్లను రేకెత్తించింది అవును తను గోపాలం చేతిలో దెబ్బలు తిన్నాడు. తను చేసిన తప్పుపనికి అతను శిక్షిం చాడు. కానీ యివాళరోజు అదే వ్యక్తి తన క్రింది వుద్యోగిగా వచ్చాడు. గోపాలం యెలా ఆలోచిస్తున్నాడో అన్న భావన ఆయనలో వొకొక్కసారి నవ్వు, మరొక్కసారి చిన్నతనం కూడా చొప్పిస్తున్నయి. "యెందుకు నవ్వుకుంటు న్నారు" భార్య అడిగింది.

భార్యముందు రహస్యం అంటూ లేని వినాయకరావు జరిగిందంతా చెప్పటం మొదలెట్టాడు.

* * *

కమలమ్మముందు బల్లిలా గోడకు కరుచుకుని నిలబడ్డాడు గోపాలం. బొమ్మల కొలువులో నమ్రత నొలకా పోసే పింగాణీ బొమ్మలా పాలిపోయి వున్నాడు.

"యెందుకు రాజారావు టెండర్ తీసు కోలేదు?"

"ఆయన టైము దాటిన తరువాత యిచ్చారండీ, అందుకని."

"అయితే మాత్రం...నువ్వు రోజూ టైముకు భోంచేస్తున్నావా, టైముకు యింటికి వెళ్తున్నావా... టైము ప్రకారం లేస్తున్నావా..."

అవును, తనకు తనజీవితానికి గడియా రంతో, అసలు కాలంతో సంబంధంలేదు. ఇంట్లో యెన్నోసరదాలు - తన ఆలశ్యం మూలంగా తెరవెనక్కి పోతూంటాయి రోజూ... రోజూ భార్య యెన్నో అలకలు పోతుంది తన నడకతో విసిగి... తను మరేం చెయ్యలేక యీనాటికి విసిగి - అసలు - గడియారం అంటేనే అసహ్యం పెంచుకున్నాడు

"అందుకే చెప్తూంట... యీ రోజైనా ఆయన టెండర్‌ని యలా చెయ్యండి".

''సరే", గోపాలం ఆఫీస్‌కు వచ్చాడు. వొకేవక్క ప్రాణంతో, మిగిలిన నాల్గు ప్రాణాలు లఫీసరుగా రింట్లోనే వుండి పోయాయి. తిరిగి రాజారావు వచ్చి – అతని పని సవ్యంగా జరిగినట్లు తెలిస్తేనే ఆనాలుగూ ఆఫీసరమ్మగారు తన కిస్తుంది లేకపోతే మిగిలిందికూడా లాక్కుని...

పూటెక్కిన ఇనప్పెట్టి నడుస్తున్నట్టుగా, వరద నీరు తగిలిన గోదావరిలా రాజారావు వస్తున్నాడు, కుర్చీ ప్రాణం తెచ్చుకుని అతను కూర్చోగానే కిర్రు మంటూ సంగీతం పాడింది.

"నిన్న నే చెబితే విన్నావుటయ్యా... మీకు అమ్మ పెట్టేవి నాల్గూ పెట్టాలి..." రాజారాం మాటలు.

గోపాలం తిరిగి వివశు డౌతున్నాడు. రాజారావు ప్రతీ గుమాస్తానీ క్షేమ సమాచారా లడుగుతూ ఆఫీసంతా కలియ తిరిగాడు. మధ్యలో రెండు కారా కిళ్ళీలు నమిలాడు...నాలుగు హైక్లాసు సిగరట్లు తను కాల్చి ఆరు మిగిలినవాళ్ళచేతకూడా తాగించాడు...అందరూ అతని శరీరంలో భాగాలుగా, అణువుగా ప్రవర్తిస్తున్నారు. అతను వెళ్ళిపోయాడు. గోపాలం టేబిల్ మీద రాజారావు యిచ్చిన టెండర్ కవరు వుంది. నెమ్మదిగా తీసుకున్నాడు...దాని కిందే మరో పదిరూపాయల కాగితం... రాజారావు పదిరూపాయలతో తన నోరు మూశాడు. ఆ కాగితంతో తన హృదయాన్ని పేపర్ వెయిట్‌లా నొక్కేశాడు. తన ఖరీదు...తను చేశే పని ఖరీదు పదిరూపాయలు.

పదిరూపాయల నోటు ప్రాణం తెచ్చుకుని నవ్వుతూంది. పగలబడి మరీ నవ్వుతూంది...

*　　*　　*

రాజారావు టెండరు ఆలశ్యంగా ఆఫీసరుగార్కి పుటప్ చేస్తోన్నందుకు–హెడ్ మేనేజరు పిల్చి గోపాలాన్ని నానా చివాట్లూ పెట్టాడు. గోపాలంకు యేం చెప్పాలో తెలియలేదు. యేదైనా చెప్పాలంటే పక్కనే రాజారావు నించుని వున్నాడు. అప్పుడే రాజారావు తెప్పించిన బోరన్‌విటా తాగుతున్నాడు తనముందరే మేనేజర్ ''యీయన టెండర్ నిన్ననే యిచ్చారటగా నీకు"...మాట్లాడలేదు.

"మీ కుర్రాళ్లతో యింతేనయ్యా.. పని మీద దృష్టి తక్కువ..."


"మీటింగ్ యీ రోజు కాబట్టి సరిపోయింది...లేకపోతే..."

"మర్చిపోయానండి" అన్నాడు పైకి గోపాలం. నిన్న యిదే మేనేజర్ – తన దగ్గరవున్న సీల్డుటెండర్స్ అన్నీ యిచ్చేస్తున్నానని చెప్పాడు కానీ యీవేళ...

మద్యాహ్నం వినాయకరావు – అనే ఆఫీసరు తోడేలు– గోపాలం అనే మేక పిల్లను అడుగుతోంది.

"ఆ టెండర్ నిన్ననే మేనేజరుకు యివ్వటం మర్చిపోయావుటగా"

"అవును..."



"చాలా గొప్ప బుర్రగలవాడని చెప్పుతున్నావు కదా! పుర్రె అంత చిన్నదిగా ఉన్నదేం?''

"అది వారి చిన్నప్పటి పుర్రెలెండి!''

"యెందుకని?"

తనకు వళ్ళు బలిసిందని చెప్పాలా.. లేకపోతే స్వప్నాల్లో తేల్తూవుండి పోయానని చెప్పాలా?"...

"శ్రద్ధగా పని చెయ్యాలి...గోయవే" అన్నాడు.

ఆ తరవాత గంటకు తెల్లకాగితం మీద అందమైన ముద్ర అమ్మాయి చేతివేళ్ళ వ్రాసిన మెమో అందుకున్నాడు... అందులో సారాంశం...

''అత్యవసరమైన ఆఫీసు కాగితాలను నీ దగ్గర అట్టే వుంచుకుని సకాలంలో ఆఫీసరుగారికి అందజెయ్యనందువల్ల మొదటిసారిగా హెచ్చరిస్తూ నీపైన యెందుకు క్రమశిక్షణాయుత కార్యము తీసుకోకూడదో తెలియబర్చే జవాబు, క్రింద సంతకంచేసినవారికి ఆరుగంటల లోపున అందజేయవలెను.

తన చేత్తోనే - చెయ్యని శిక్షకు - అంతకంటే అబద్ధమైన అంశాలను సారాంశాలుగా పొందుపరిచి సరియైన కాలువ గుండా (ప్రాపర్ ఛానల్) ఆఫీసరు హృదయ సంద్రానికి బట్వాడా చేస్కున్నాడు

ఆఫీసులో మిగతా - కాదు, కొన్ని గుమాస్తా నోళ్ళు, మిగతా గుమాస్తా చెవుల్ని కొరకడం ప్రారంభించాయి.

"పాపం గోపాలం..."

"పాప మేమిటోయ్...మెమో వస్తే వచ్చింది. గంట వెనుక డబ్బు వచ్చిందిగా."

"మరైతే మేనేజర్ యెలా వప్పుకున్నా డంటావ్."

"ఆయన జేబుల్లో పెద్దాపురం నూతులు వున్నాయని – ఆయనకు ఆఫీస్ టైములో మంగళగిరి పానకాలస్వామి పూనతాడని నీకు తెలియదా!"

"మరి కొత్త ఆఫీసరుగారు..."

"యేమో, నిజాయితీపరుడని చెప్పుకుంటారు."

"మెమో యిచ్చి హడావిడి చేశాడు గానీ టెండర్ కేన్సిల్ చెయ్యలేదుగా!"

"దేర్‌ఫోర్ రెండూ రెండూ నాలుగూ..."

నవ్వులూ...కామెంట్స్...కథలు... అన్నీ వినబడుతున్నాయి. కనబడుతున్నాయి గోపాలం గుండెల్లో, పైగా ఆఫీసరు తిరిగి పిల్చి...

"గోపాలరావ్ – ఆ రాజారాం డబ్బు యిచ్చి టెండర్ యెడ్మిట్ చేయించుకునే జాతి మనిషి... జాగ్రత్త..."

తిరిగి మాట్లాడలేకపోయాడు.

"డబ్బు కాని యిచ్చాడా?"

"లేదు."

"రెమో",... వినాయకరావు నవ్వుతున్నాడు... లసని మాటంతో, మెమోంతో, వ్యంగ్యంతో హెచ్చరిస్తున్నాడు మెత్తిపొడుస్తున్నాడు. తన నిజాయితీని... ఆ రోజు తప్పు చేసి శిక్షింపబడ్డాడు. తప్పు చెయ్యక మనిషన్నవాడు బ్రతకలే డని యిది హెచ్చరికా... లేక తప్పుని తప్పుతో నొక్కి పెట్టడమా... అర్థం కాలేదు.

*    *    *

వేడి కాఫీ యిచ్చింది వోమిరియం గాజుల చెయ్యి...నెమ్మదిగా సిప్ చేస్తోంది మరో రిస్టువాచీ హేండ్... "మీ భయం పోయిందా", లిప్‌స్టిక్ పెదవి అడిగింది.

"ఆ, నాభయం తీరిపోయింది యెంతయినా చూడు ... ఆఫీసర్ని" ... అంది మీసం కింది నోరు

"పాపం నలుగురితో మీ చిన్నప్పటి ఘనత చెప్పి ఆనందిస్తాడని. .యీవేళ అతనినోరు కట్టేయించారు...నా చేత ..

"నీకు తెలియదు కమలం . మనిషి అనుమానం భరించలేడు. .అలాగే దర్పం కూడా దాచుకోలేడు ఫలానా వ్యక్తి నా చేతిలో మనిషి అనే వూహ నా చేత నాకు తెలియకుండా వింతైన పన్లు చేయిస్తుంది అని యెదటివాళ్ళ మీద యెటువంటి ఫలితా లిస్తాయో కూడా మర్చిపోయేటట్టు చేస్తుంది. అది రావాలని చేసింది కాక పోయినా–ఆ పొంగే వూహల మీద–హమేషా వెనుకచూ పనే చల్లని నీళ్ళు పడ్తూవుండాలి...నా వుద్దేశ్యం గోపాలం నాకు ద్రోహం చేస్తాడనీకాదు – కానీ నా ఆఫీసరు హోదా ముక్కాలు మీద కాకుండా నాలుగు కాళ్ళా నిండిగా అని నా ఆశ...మామూలు వినాయకరావుగా నేను గోపాల్రావుని వాడి నిజాయితీని మెచ్చుకోకుండా వుండలేను అలాగని పైకి చెప్పా లేను." రెండు గుండెలూ క్షణం నిజంగా, నిజాయితీగా వూపిరి వదుల్తున్నాయి.